నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | మంగళవారం 25 ఫిబ్రవరి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

● 'టెన్'షన్ వద్దు..

ప్లానింగ్ ప్రధానం

మార్చి 21వ తేదీ నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు

- ప్రణాళిక ప్రకారం ప్రిపేర్ అయితే ఉత్తమ మార్కులు
- సబ్జెక్టులవారీగా వ్యూహం అనుసరించాలి..
- ఇష్టంగా చదవి.. అందంగా రాయాలి..
- టెన్త్ విద్యార్థులకు నిపుణుల సలహాలు, సూచనలు

సాధారణంగా మార్చి, ఏప్రిల్ మాసాల్లోనే విద్యార్థులకు పరీక్షలు ప్రారంభం అవుతాయి. ఈ మాసాలు అంటేనే విద్యార్థుల్లో ఒక రకమైన భయం మొదలవుతుంది. డిప్రెషన్ అలుముకుంటుంది. బాగా చదవాలి, బాగా పరీక్షలు రాయాలి, మంచి మార్కులు తెచ్చుకోవాలి అనే ఆలోచనలు నిద్రలేకుండా చేస్తాయి. మరికొందరు మానసిక ఒత్తిడికి గురవు తారు. ఈ సమయమే కీలకం. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థుల్లో మనోనిబ్బ రం నింపాలి. ఉత్కంఠ, ఉద్వేగా లకు గురికాకుండా చూసుకోవాలి. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే సులువుగా ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు మంచి మార్కులు కూడా తెచ్చుకోవచ్చని విద్యావేత్తలు సూచిస్తున్నారు. - ఇచ్చోడ, ఫిబ్రవరి 24

25 రోజుల్లోనే పరీక్షలు..

మార్చి 21వ తేదీ నుంచి టెన్త్ వార్షిక పరీక్షలు ప్రారంభంకానున్నాయి. అంటే ఇంకా 25 రోజుల సమయం మాత్రమే ఉంది. ఆదిలాబాద్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బాలికలు 4,993.. బాలురు 5,058.. మొత్తం 10,051.. నిర్మల్ జిల్లాలో బాలికలు 4,685.. బాలురు 4,442.. మొత్తం 9,127 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఏడు పేపర్ల పరీక్షలు రాయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో విద్యార్థులు ఆరోగ్యపరంగా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, పరీక్షకు ఎలా సన్నద్ధం కావాలి.. ఉన్నటు వంటి సమయాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలనే అంశాలపై సబ్జెక్టు, విద్యారంగ నిపుణుల అభిప్రాయాలతో 'నమస్తే' తెలంగాణ ప్రత్యేక కథనం.

పునఃశ్చరణ చేయాలి..

● తెలుగు

సహజంగా పరీక్షలు అనగానే విద్యార్థుల్లో భయం ఉంటుంది. తెలుగు పరీక్ష మొదటి రోజే ఉంటుంది. కొత్త వాతావరణం కాబట్టి కొంత ఉత్కంఠతగా ఉంటుంది. తెలుగు పేపర్‌లో మంచి మార్కులు సాధించేందుకు.. ముందుగా పద్యభాగం, గద్యభాగంలోని అన్ని అంశాలను గుర్తుంచుకోవాలి. వాటిని పునఃశ్చరణ చేసుకోవాలి. పాఠాన్ని చదవడంతో సరి పెట్టకుండా సారాంశాన్ని, ఉద్దేశాన్ని తెలుసుకోవాలి. ప్యాసేజ్ పేరిట ఉండే అపరిచిత గద్యం ఎంతో ముఖ్యం. ఈ విషయంలో సొంతంగా ఆలోచిస్తూ చదవాలి. ఉపవాచకానికి సంబంధించి ఇతివృత్తం, ప్రాముఖ్యత, పాత్రలు, వాటి ప్రాధాన్యత, వ్యక్తుల ప్రవర్తన శైలి వంటి అంశాల ద్వారా ఇచ్చే సందేశాన్ని తెలుసుకోవాలి. వ్యాకరణంలో మంచిగా ప్రతిభ చూపాలంటే సంధులు, సమాసాలు, సంయుక్తార్థాలు, ఉత్పత్యర్థాలు, జాతీయాలను బాగా చదవాలి.

- సెర్పూర్ సత్యనారాయణ, తెలుగు విషయ నిపుణులు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సిరికొండ.

అక్షర దోషాలపై దృష్టి సారించాలి..

● ఆంగ్లం

తెలుగు మీడియం విద్యార్థులకు కొంచెం ఆంగ్లం అంటే భయం ఉండడం సహజం. కానీ.. ప్రణాళిక ప్రకారం చదివితే పదికి పది సాధించవచ్చు. మొదట అక్షర దోషాలపై దృష్టిసారిం చాలి. మంచి మార్కులు సాధించాలంటే వెర్బల్, నాన్ వెర్బల్ అంశాలను బాగా చదవాలి. ఉదాహరణకు.. లేబుల్స్, బార్ డయాగ్రమ్స్‌పై చార్ట్స్ అంశాలను అధ్యయనం చేయాలి. సొంతంగా విశ్లేషించే లా నైపుణ్యం పెంచుకోవాలి. ఇందుకోసం పాత ప్రశ్నపత్రాల సమాధానాలను పరిశీలించడం మేలు. ప్రతి పాఠం చివరలో ఉండే కాంప్రహెన్సివ్ ప్రశ్నలపై దృష్టి పెట్టాలి. ప్రతి పాఠం సా రాంశాన్ని గ్రహించి సొంతంగా రాసుకునే అలవాటు చేసుకోవాలి. పద్యంలో ముఖ్య పదాలు, యాంటానిమ్స్, సినానిమ్స్‌పై దృష్టి సారించాలి. వీటితోపాటు పార్ట్స్ ఆఫ్ స్పీచ్, డైరెక్ట్, ఇన్ డైరెక్ట్ స్పీచ్, యాక్టివ్ వాయిస్, ప్యాసివ్ వాయిస్, ఫ్రేజిల్ వెర్బ్స్ ఈ విషయంలో చదవడంతో పాటు ప్రాక్టీస్ కూడా చేస్తే మెరుగైన మార్కులు పొందేందుకు ఆస్కారం లభిస్తుంది. అదేవిధంగా అపరిచిత గద్యం సారాంశాన్ని గ్రహించేలా చదవాలి. లెటర్ రైటింగ్‌కు సంబంధించి పంక్చుయేషన్స్, బాడీ ఆఫ్ ది లెటర్ వంటి అంశాలపై పట్టు అవసరం.

- శ్రీనివాస్, ఇంగ్లీష్ విషయ నిపుణులు, ఆశ్రమ ఉన్నత పాఠశాల, ఉమ్రి(బి)

ప్రాక్టీస్ చాలా ప్రధానం

● గణితం

విద్యార్థులు క్లిష్టంగా భావించే సబ్జెక్ట్ మ్యాథమెటిక్స్. సిలబస్ అంశాలను అధ్యయనం చేస్తూ.. ప్రాక్టీస్ చేయడం ద్వారా ఈ సబ్జెక్ట్‌పై పట్టు సాధించొచ్చు. సంఖ్యా వ్యవస్థ, బీజగణితం, నిరూపక రేఖాగ ణితం, రేఖాగణితం, క్షేత్రమితి, త్రికోణమితి, సంభావ్యత, సాంఖ్యకశాస్త్రంపై సంపూర్ణ అవగాహన పెంచుకోవాలి. ప్రాబ్లమ్ సాల్వ్ చేయడంతోపాటు కారణాల నిరూపణ, వ్యక్తీకరణ, ఒక సమస్యను ఇతర అంశాలతో అనుసంధానం చేయడం వంటి నైపుణ్యాలు పొందాలి. ముఖ్యమైన నిర్వచనాలు, సూత్రాలను నోట్స్ రూపంలో రాసుకుంటే.. రివిజన్ సమయంలో ఉపయుక్తంగా ఉంటుంది. పాఠ్యపుస్తకంలో ప్రతి చాప్టర్ చివరన ఇచ్చే సమస్యలను తప్పకుండా ప్రాక్టీస్ చేయాలి. గ్రాఫ్‌లు, నిర్మాణాత్మక సమస్యలకు సమాధానాలు కొనుగోనేందుకు ప్రాక్టీస్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. వాస్తవ సంఖ్యలు, సమితులు, బహుపదులు, రెండు చరరాశులలోని రేఖీయ సమీకరణాల జత అధ్యయాల్లోని గ్రాఫ్ ఆధారిత సమస్యలు, సంభావ్యత, సాంఖ్యక శాస్త్రం, త్రికోణమితి, క్షేత్రమితిలోని ముఖ్యమైన సమస్యలను సాధన చేయాలి.

- జాదవ్ పుండలిక్, గణితశాస్త్రం నిపుణులు, ఆశ్రమ ఆదర్శ పాఠశాల, రాయిగూడ.

నిజ జీవిత ఘటనలతో అన్వయించుకుంటూ ప్రిపేర్ కావాలి

● భౌతిక శాస్త్రం(పార్ట్-ఎ)

సైన్స్ సబ్జెక్ట్‌లో పార్ట్-ఏ ఫిజికల్ సైన్స్ ఉంటుంది. ఇందులో అప్లికేషన్ అప్రోచ్‌తో చదవడం ముఖ్యం. ఆయా చాప్టర్ల అంశాలను నిజ జీవిత ఘటనలతో అన్వయించుకుంటూ ప్రిపరేషన్ సాగిస్తే.. విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చు. విషయ అవగాహనతోపాటు, ప్రశ్నించడం, పరికల్పన చేయడం, ప్రయోగాలు-క్షేత్ర పర్యటనలు, సమాచార నైపుణ్యాలు-ప్రాజెక్ట్ పనుల పటాలు, వాటి ద్వారా భావ ప్రసారం వంటి వాటిని కృషి చేయాలి. కాంతి పరావర్తనం, కాంతి వక్రీభవనం, విద్యుత్ ప్రవాహం, రసాయన బంధం, పరమాణు నిర్మాణం, కార్బన్ సమ్మేళనాలపై పట్టు సాధించాలి. మూలకాల ధర్మాలు-వర్గీకరణ, రసాయన సమీకరణాలను బాగా ప్రాక్టీస్ చేయాలి. ఇలా చేయడం వల్ల లఘు, అతి స్వల్ప, బహుశైచ్చిక ప్రశ్నలకు సులువుగా సమాధానాలిచ్చే పట్టు లభిస్తుంది. ప్రశ్నను ఎలా అడిగినా సమాధానం ఇచ్చే సంసిద్ధత లభించి.. మంచి మార్కులు సొంతమవుతాయి.

- ఆత్రం చంద్రకాంత్, భౌతికశాస్త్ర నిపుణులు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సిరికొండ.

అబ్జెక్టివ్ ప్రశ్నలు చదవాలి..

● సాంఘికశాస్త్రం

సమకాలీన అంశాలపై అవగాహన పెంచుకోవాలి. పాఠ్య పుస్తకంలోని ఏదైనా ఒక అంశాన్ని చదువుతున్నప్పుడు దానికి సంబంధించి మన నిజజీవితంలో జరుగుతున్న ఘటనలతో పోల్చుకుంటూ చదవాలి. సమకాలీన అంశాల విషయంలో ప్రతిస్పందన, ప్రశ్నించడం, ప్రశంస, అభినందనలపై సాధన చేయడం అవసరం. అవగాహనకు సంబంధించి ఒక నిర్దిష్ట అంశాన్ని చదివి.. సొంత పరిజ్ఞానంతో రాసే నైపుణ్యం పెంచుకోవాలి. జాగ్రఫీ, ఎకనామిక్స్‌లో భారతదేశం-భౌగోళిక స్వరూపం, శీతోష్ణస్థితి, భారతదేశ నీటి వనరులు, వలసలు, ఆహార భద్రత, ఉత్పత్తి-ఆదాయం, సుస్థిరాభివృద్ధి పాఠ్యాంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. హిస్టరీలో రెండు ప్రపంచ యుద్ధ కాలాల సమయంలో ప్రపంచం, సమకాలిన సామాజిక ఉద్యమాలపై దృష్టి పెట్టాలి. భారత జాతీయోద్యమ చరిత్రను ప్రత్యేక దృష్టితో చదవాలి. సివిక్స్‌కు సంబంధించి రాజ్యాంగం మూల సూత్రాలు, రాజ్యాంగంలో పేర్కొన్న అంశాలను ఏఏ దేశాల రాజ్యాంగం నుంచి అనుసరించారు వంటి కోణాల్లో చదవాలి.

- కిషన్ సింగ్, సాంఘికశాస్త్రం నిపుణులు, ఆశ్రమ ఉన్నత పాఠశాల, మోడిగూడ.

దృష్టి సారించాల్సిన అంశాలు

- సిలబస్‌లో ఆయా సబ్జెక్ట్‌లు, చాప్టర్లలో సిలబస్‌ను పరిశీలించాలి. ● ముఖ్యమైన చాప్టర్లను వెయిటేజీ ఆధారంగా వర్గీకరిం చుకోవాలి ● అత్యధిక వెయిటేజీ ఉండే అంశా లపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ● ఇప్పటి నుంచే ప్రాక్టీస్ ఆధారిత ప్రిపరేషన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. ● అవగాహన, ప్రతిస్పందన, స్వీయ విశ్లేషణ నైపుణ్యాలు పెంచుకోవాలి.
- మ్యాథమెటిక్స్, సైన్స్ సబ్జెక్ట్‌లకు సంబంధించి బేసిక్ కాన్సెప్ట్‌ను బాగా అధ్యయనం చేయాలి
- ప్రతి అంశాన్ని సొంతంగా విశ్లేషించే విధంగా ప్రాక్టీస్ చేయాలి. ● అందమైన దస్తూరి వేగంగా రాసేలా సాధన చేయాలి. ● పదాలు, పేరాల మధ్య తగినంత నిడివి పాటించాలి.
- గొలుసుకట్టు రాతలు, అక్షరంపై మరో అక్షరం రాయకూడదు. ● పెన్ను, పెన్సిల్ పట్టుకునే విధానం చక్కగా ఉండాలి. ● అక్షరదోషాలు లేకుండా సరిచూసుకోవాలి. ● మొదటి వరసలో ఎంత బాగా రాశామో చివరి వరకు చేతి రాతను అలాగే కొనసాగించాలి.

పరీక్షల్లో మార్పులివే..

- ఈసారి నుంచి పదో తరగతి విద్యార్థులకు 24 పేజీల బుక్‌లెట్‌ను ఇస్తారు. ఇది వరకు విడి పేపర్లు ఇచ్చే వారు. ఆన్సర్లు రాసి పేపర్లను కూర్చి, దారం కట్టాల్సి వచ్చేది. ఇక నుంచి కేవలం బుక్‌లెట్ మాత్రమే ఇస్తారు.
- గతేడాది నుంచి ఆరు పేపర్లకుగాను ఏడు రోజులపాటు పరీక్షలను నిర్వహిస్తున్నారు. సైన్స్‌లో జీవశాస్త్రం, భౌతికశాస్త్రం పేపర్లకు రెండు రోజులపాటు పరీక్షలను నిర్వహిసుస్తున్నారు.
- పదో తరగతి మెమోలపై పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబర్(పెన్)ను ముద్రిస్తున్నారు. వ్యక్తికి ఆధార్ ఎలాగో విద్యార్థులకు' పెన్' అలాగే పని చేస్తుంది.

బొమ్మలు గీయడం ముఖ్యం..



● జీవశాస్త్రం(పేపర్-బి)

సైన్స్ పేపర్ పార్ట్-బీ జీవశాస్త్రంలో రాణించేందుకు అవగాహన, స్వీయ విశ్లేషణ నైపుణ్యాలను పెంచుకోవాలి. పుస్తకాల్లోని ఆయా అంశాలకు సంబంధించి ఫ్లో చార్ట్‌లు, బ్లాక్ డయాగ్రమ్స్‌లను సొంతంగా రూపొందించుకోవాలి. విశ్లేషణాత్మక, తులనాత్మక అధ్యయనానికి ప్రాధాన్యం ఇవ్వాలి. నేర్చుకున్న అంశాలను వాస్తవ పరిస్థితులతో అన్వయించే విధంగా చదవాలి. ప్రయోగాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ప్రయోగ నిర్వహణ ప్రక్రియపై అవగాహన పొందడం మేలు చేస్తుంది. ఆయా అంశాలకు సంబంధించి చాప్టర్‌లో పేర్కొన్న అభ్యాసాలకు సంబంధించి విశ్లేషణ, కారణాలు, పోలికలు, బేధాలు తెలుసుకుంటూ చదవాలి. డయాగ్రమ్స్ విషయంలో భాగాలను గుర్తించడమే కాకుండా.. వాటి ప్రాముఖ్యతను వర్ణించగలిగే విధంగా ప్రాక్టీస్ చేయాలి. విద్యార్థులు చదవుతోపాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి.

- హిమబిందు, జీవశాస్త్రం నిపుణులు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఇచ్చోడ

మననం చేసుకోవాలి

● హిందీ

రెండో పేపర్ హిందీ ఉంటుంది. మొదటి ప్రశ్నపత్రము చదవడానికి 15 నిమిషాల సమయం ఇస్తారు. కాబట్టి ప్రశ్నలను నిధానంగా చదివి, బాగా రాయగలిగే ప్రశ్నలకు జవాబులను ముందుగా రాయాలి. పాఠ్య పుస్తకాన్ని, రాసుకున్న నోట్స్‌ను అర్థం చేసుకుని చదవాలి. చదివిన అంశాలను తిరిగి మననం చేసుకోవాలి. పరీక్షల చివరి సమయంలో కొత్త విషయాలు, వేరే ఇతర మెటీరియల్‌ను చదవకుండా ముందు నుంచి చదివిన వాటినే చదవాలి. పాఠం పేరు, కవి, రచయిత పేరు, ఆ పాఠంలోని ముఖ్యాంశాలను తెలియజేసే పట్టికలను పద్య భాగం, గద్య భాగం, ఉపవాచకాలను వేర్వేరుగా తయారు చేసుకోవాలి. ప్రతి పాఠంలోని భాషా కిబాత్, శబ్ద బండార్ అంశాలను ఒకేచోట అంశాలవారీగా రాసుకుని చదవడం వల్ల వాటిపైన పట్టు వస్తుంది. అందంగా, గుండ్రటి అక్షరాలతో పాటు కొట్టి వేతలు లేకుండా పద్యాలను విడగొట్టకుండా విద్యార్థులు రాయాలి. వ్యాకరణంపై మంచి అవగాహన కలిగి ఉండాలి. బహుళైచ్చిక ప్రశ్నలలో పూర్తిస్థాయి మార్కులు సాధించవచ్చు. ఈ సూచనలు పాటిస్తే పదికి పది సాధించవచ్చు.

- జాదవ్ సంతోష్, హిందీ విషయ నిపుణులు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సిరికొండ.

ఇందారంలో సర్వేయర్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

భూ సర్వేను అడ్డుకున్న గ్రామస్తులు

జైపూర్, ఫిబ్రవరి 24: జైపూర్ మండలంలోని ఇందారంలో 1113 సర్వే నంబర్‌లో హద్దులు గుర్తించేందుకు సోమవారం సర్వేయర్ రామస్వామి సర్వే నిర్వహిస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. వందల సంవత్సరాలుగా ఇండ్లు నిర్మించుకుని తాతలు తండ్రుల కాలంగా తాము ఇక్కడ జీవిస్తుండగా మా ఇండ్ల అడుగు భూమిని ముత్యంరావు వారసుడిగా చెప్పుకునే ఆనంద్‌కృష్ణ అనే వ్యక్తి మోసపూరిత పట్టాలు చేసుకున్నాడని స్థానికులు పేర్కొన్నారు. మిగులు భూములను (పట్టా లేనివి) రెవెన్యూ అధికారుల సహకారంతో పట్టాలు చేసుకుని సర్వే పేరుతో స్థానికులను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తెలిపారు. నివాస స్థలాలకు పట్టాలు ఇచ్చిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పట్టాలు చూపించి నివాసం ఉంటున్న వారి నుంచి డబ్బులు వసూలు చేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ స్పందించి దీనిపై విచారణ చేపట్టి అక్రమంగా పట్టా చేసుకున్న వారిపై, ఇందుకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సర్వే కోసం వచ్చిన సర్వేయర్ తిప్పి పంపించారు. నివాస స్థలాలను తమ పేరుపై పట్టా చేశాకే సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు.

లబ్ధి జరిగితేనే ఓట్లేయండి

- సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనతో కాంగ్రెస్ సెల్ఫ్‌గోల్
- అరకొరగానే రుణమాఫీ, రైతుభరోసా అమలు
- ఆ పథకాలు వస్తేనే ఓట్లేయాలన్న సీఎం రేవంత్‌రెడ్డి

మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి

మంచిర్యాల, ఫిబ్రవరి 24(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం మంచిర్యాల జిల్లాకు వచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఉన్నప్పటి నుంచి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటి వరకు తెలుగు రాష్ట్రాల్లో ఏ సీఎం కూడా ఎమ్మెల్సీ ఎన్నికలను ఇంత సీరియస్‌గా తీసుకోకపోవడం, కానీ.. ఈ ఎన్నికల్లో స్వయంగా సీఎం రంగంలోకి దిగడం తీవ్రమైన చర్చనీయాంశమైంది. రేవంత్‌రెడ్డి ప్రచారంతో కాంగ్రెస్ సెల్ఫ్‌గోల్ వేసుకుందని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమి భయంతోనే స్వయంగా సీఎం రంగ ప్రవేశం చేశారనే రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. సీఎం మాట్లాడిన తీరు ఓటర్లను అయోమయంలో పడేసేలా ఉందంటున్నారు. సీఎం మాటల్లో అస్పష్టత, గందరగోళం కనిపించింది. డీఎస్సీ నోటిఫికేషన్, పోలీసు ఉద్యోగాలు, పారామెడికల్ సిబ్బంది ఉద్యోగాలు ఇచ్చామని.. రైతు రుణమాఫీ, రైతు భరోసా, 200 యూనిట్ల ఉచిత కరెంట్, రూ.500 గ్యాస్ సిలిండర్, సన్నవడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నామన్నారు. తాను చెప్పినవన్నీ నిజాలైతేనే కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థికి ఓటెయ్యాలని.. లేకపోతే మీకు నచ్చిన వ్యక్తికి ఓటెయ్యాలంటూ పిలుపునిచ్చారు. వాస్తవానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇంత వరకూ సంపూర్ణంగా రైతు రుణమాఫీ జరగలేదు. సాంకేతిక కారణాలు బూచిగా చూపి చాలా మంది రైతులకు రుణమాఫీ చేయలేదు. రుణమాఫీ కాక సహకార సంఘాలు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న రైతులు ఎంతో మంది ఉన్నారు. రైతు భరోసా పెట్టుబడి సాయం అరకొరగానే జమ చేశారు. కేవలం 3 ఎకరాల్లోపు వ్యవసాయ భూములున్న వారికే ఎకరాకు రూ.6వేలు చొప్పున జమ చేశామని ప్రభుత్వం చెప్పినప్పటికీ వాస్తవానికి అర్హులైన వారిలో సగానికి ఎక్కువ మందికి రైతుభరోసా అందలేదు. గృహలకు 200 యూనిట్లు, రూ.500 గ్యాస్ సిలిండర్, సన్నవడ్లకు బోనస్ ఇప్పటి దాకా అందని లబ్ధిదారులు చాలా మంది ఉన్నారు. ఈ విషయంలో జనాలంతా ప్రభుత్వంపై తీవ్రమైన అసంతృప్తితో ఉన్నారు. వాటినే సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించడం, ఈ పథకాలు వస్తేనే ఓటేయండి లేకపోతే మీ ఇష్టం అని ప్రకటన చేయడంతో ఇప్పుడు ఈ బాధిత కుటుంబాల్లోని పట్టభద్రులు కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తారా.. లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. సీఎం టూర్‌తో కాంగ్రెస్ అభ్యర్థికి జరిగిన మేలు కంటే.. నష్టమే ఎక్కువై పోయిందనే చర్చ ఇప్పుడు జిల్లాలో నడుస్తున్నది.

విస్తుపోయిన జనాలు..

సీఎం ప్రసంగంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించి ఎలాంటి స్పష్టమైన హామీలు రాలేదు. స్థానిక ఎమ్మెల్యే పీఎస్ఆర్ మంచిర్యాల మున్సిపాలిటీ మాస్టర్ ప్లాన్‌కు రూ.78 కోట్లు కావాలని, గూడెం గుట్ట, విశ్వనాథ ఆలయాల అభివృద్ధిని నిధులు కావాలని కోరారు. కానీ సీఎం ప్రసంగంలో వీటిపై ఎలాంటి ప్రకటన చేయలేదు. మంచిర్యాలలో సభ ఆలస్యంగా మొదలైంది. షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 1.30 గంటలకు ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ సీఎం రావడం ఆలస్యమైంది. దీంతో సాయంత్రం 5 గంటల దాకా ఓపికతో కూర్చున్న జనాలు.. విసుగెత్తిపోయారు. సీఎం ప్రసంగం మధ్యలోనే లేచి సీఎం మాట్లాడుండగా జనాలు వెళ్తున్నట్లు గుర్తించిన కాంగ్రెస్ లీడర్లు, పోలీసులు వారిని కాసేపు అడ్డుకున్నారు. దీంతో కాసేపు గందరగోళం నెలకొంది. రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్, మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్ ఎమ్మెల్యేలు కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, గడ్డం వివేక్, గడ్డం వినోద్, మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కుందారం అటవీప్రాంతంలో పులి పాదముద్రలను పరిశీలిస్తున్న అటవీ అధికారులు

కుందారంలో పెద్దపులి సంచారం

జైపూర్, ఫిబ్రవరి 24: మండలంలోని కుందారం అటవీప్రాంతంలో ఆదివారం పెద్దపులి సంచరించిన ఆనవాళ్లు కనిపించినట్లు ప్లాంటేషన్ మేనేజర్ గోగు సురేశ్‌కుమార్ తెలిపారు. కుందారం ప్లాంటేషన్‌లో పాదముద్రలు గుర్తించినట్లు పేర్కొన్నారు. భీమారం ఆరెపల్లి గుండా కుందారం అటవీ ప్రాంతంలో సంచరించినట్లు ఆనవాళ్లు ఉన్నాయన్నారు. కుందారం రైతులు, ప్రజలు అటవీ ప్రాంతానికి వెళ్లవద్దని చెన్నూర్ రేంజ్ అటవీ అధికారులు భగవంతరావు, సతీశ్, శ్రీధర్ హెచ్చరించారు. పశువులను కూడా అటవీ ప్రాంతం వైపు వెళ్లకుండా చూడాలని తెలిపారు. పెద్దపులి సంచరించిన ప్రాంతంలో తిరుగుతూ పులికి ఎలాంటి ఆపాయం కలుగకుండా రక్షణ చర్యలు చేపట్టారు.